క్లుప్తంగా

నీట్‌లో సత్తా చాటిన గిరి పుత్రుడు



విఘ్నేశ్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని పీటీజీ గిరిజన గురుకుల విద్యార్థి విఘ్నేశ్ నీట్‌లో సత్తాచాటి రాయ్‌పూర్‌లోని నీట్ కళాశాలలో సీటు సాధించగా ఉపాధ్యాయులు శనివారం ఆయనను ఘనంగా సత్కరించారు. ఉట్నూర్ మండలం రాంపూర్ కె గ్రామానికి చెందిన పెందూర్ విశ్వంత్‌రావ్ -కళాబాయిల కుమారుడు విఘ్నేశ్ ఇటీవల వెలువడిన నీట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. ఈసందర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రవీణ్‌బాబు, సిబ్బంది విఘ్నేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుజాత, ఉపాధ్యాయులు పద్మ, స్వరూప, సాయినాథ్, సత్యనారాయణ, కార్తిక్, నాగోరావ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్కులు పంపిణీ



నోట్ బుక్కులు పంపిణీ చేస్తున్న సభ్యులు

దహెగాం: మండలంలోని బీబ్రా ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు పంజాల మొండయ్య జ్ఞాపకార్థం అతని కుమారులు శ్రీనివాస్‌గౌడ్, బుల్లెట్‌గౌడ్‌లు నోట్ బుక్కులు పంపిణీ చేశారు. సర్పంచ్ బండ క్రిష్ణమూర్తి, ప్రధానోపాధ్యాయులు సదానందం, జయేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హనుమాన్ దీక్షలు ప్రారంభం



మాలధారణ చేస్తున్న అర్చకుడు శిరీశ్‌శర్మ

ఆసిఫాబాద్‌అర్బన్: పవిత్ర శ్రావణమాసాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో అర్చకులు ఒజ్జల శిరీశ్‌శర్మ ఆధ్వర్యంలో 25 మంది భక్తులు అర్ధమండల దీక్షలు స్వీకరించారు. అర్చకులు ఆలయంలో గణపతిపూజ, నవగ్రహపూజ, స్వామివారికి అభిషేకం, మంగళహారతి, మహామంత్రపుష్పం నిర్వహించారు. అనంతరం భక్తులకు మాలధారణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పిన్నా వివేక్, మధు, రావుల నారాయణమూర్తి, భక్తులు పాల్గొన్నారు.

'రుణమాఫీ అందని రైతులు వివరాలు అందజేయాలి'

కాగజ్‌నగర్‌టౌన్: ప్రభుత్వం ఇటీవల అమలు చేసిన రుణమాఫీ అందని రైతులు తమ వివరాలను మండల వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ సూచించారు. శనివారం మండలంలోని గన్నారం, ఆరెగూడ గ్రామాల్లో పర్యటించి రుణమాఫీపై రైతులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్
కుమురంభీం : జైలర్
కాగజ్‌నగర్
వెంకటరమణ : జైలర్
- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.50
సిమ్లామిర్చి	80
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	40
బీరకాయ	80
కాకరకాయ	80
బెండకాయ	60
అలసంద	60
దొండకాయ	80
పచ్చిమిర్చి	100
పాలకూర	60
సోరకాయ	60
చిక్కుడు కాయ	80
గోబి(పూల్)	100
క్యాబేజ	60

-ఆసిఫాబాద్‌అర్బన్

రహదారులకు మహర్దశ

- గ్రామీణ రోడ్లకు మోక్షం
- రూ.18.5 కోట్ల నిధులు మంజూరు
- తీరనున్న గ్రామీణుల కష్టాలు



నిధుల మంజూరు జీవో కాపీలను స్థానిక ప్రజాప్రతినిధులకు అందిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప (ఫైల్)

కౌటాల: గ్రామీణ ప్రాంతాల్లో రహదారులకు మహర్దశ పట్టనుంది. పంచాయతీరాజ్, జిల్లా పరిషత్ శాఖ నుంచి కొత్త రోడ్లతో పాటు పలు రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో ఎన్నో ఏళ్లగా రోడ్డు లేక తిప్పలు పడుతున్న గ్రామాలకు రోడ్డు వేయడంతో పాటు భారీ వర్షాలకు గుంతలు పడి, అధ్వానంగా మారిన రోడ్ల రూపురేఖలు మారనున్నాయి. వెంటనే రహదారుల నిర్మాణాలకు టెండర్లు పిలిచి పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రూ.18.5 కోట్ల నిధులు మంజూరు..

సిర్పూర్(టి) నియోజకవర్గంలో కొత్త బీటీ రోడ్లతో పాటు గుంతలు పడిన రోడ్లతో కలుపుకొని మొత్తం 13 రోడ్లకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కౌటాల, కాగజ్‌నగర్, చింతలమానెపల్లి, బెజ్జూర్, దహెగాం మండలాల్లో రోడ్ల నిర్మాణాలకు రూ.18.05 కోట్లు విడుదల చేశారు. కౌటాల మండలంలోని బాలేపల్లి, తాటిపల్లి గ్రామాల్లో బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.65 లక్షల చొప్పున కేటాయించారు. మొగడ్‌దగడ్ -వైగాం వరకు 3 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ.1.95 కోట్లు, బెజ్జూర్ మండలంలోని రుద్రాపూర్ -కుంటలమానేపల్లి వంతెన నిర్మాణానికి రూ. 50 లక్షలు, చింతలమానెపల్లి మండలం గంగాపూర్ -చింతలమానెపల్లి వరకు 4 కిలోమీటర్ల రహదారికి రూ.2.60 కోట్లు, కర్జెల్లి -ముంజంపల్లి వరకు 3 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ. 1.95 కోట్లు, దహెగాం మండలంలోని ఒడ్డుగూడ -బామానగర్ మీదుగా కుంచవెల్లి వరకు 700 మీటర్ల రహదారి నిర్మాణానికి రూ.45 లక్షలు, సిర్పూర్(టి) మండలం నవేగాంలో రహదారి నిర్మాణానికి రూ. 33 లక్షలు, కాగజ్‌నగర్ మండలం నజ్రూల్‌నగర్ విలేజ్ నం. 11 -విలేజ్ నం.12 వరకు 1.50 కి.మీ రోడ్డు నిర్మాణానికి రూ.98 లక్షలు, గొలగూడ -గువ్వలగేడ వయా సోమయ్యగూడ విలేజ్ నం. 8 వరకు 1.50 కి.మీ రోడ్డు నిర్మాణానికి రూ. 99 లక్షలు, కోయవాగు -వేంపల్లి వయా మైనారిటీ పాఠశాల వరకు 3 కి.మీ రహదారికి రూ. 2 కోట్లు, ఈజ్‌గాం -అందవెల్లి 3 కి.మీ రోడ్డు, వంతెన నిర్మాణాకి రూ.4 కోట్లు, నందిగూడలో కిలోమీటర్ రహదారి నిర్మాణానికి రూ.కోటి నిధులు మంజూరయ్యాయి.

తప్పనున్న ఇక్కట్లు..

కొత్త రోడ్లు, వంతెనలు, పాత రోడ్ల మరమ్మతులతో గ్రామీణ ప్రజలకు త్వరలో ఇక్కట్లు తప్పనున్నాయి. పంచాయతీరాజ్ విభాగం, ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో ఏళ్ల క్రితం వేసిన బీటీ రోడ్లు కంకర తేలి, గుంతలమయంగా మారాయి. దీంతో పలువురు వాహనదారులు ప్రమాదాల బారిన పడ్డారు. బీటీ రోడ్ల సౌకర్యం లేక ఏటా వర్షాకాలంలో బురదరోడ్లతో కొన్ని గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఈ పరిస్థితుల్లో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో గ్రామీణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'ఉపాధి' తనిఖీలు!



నీటికుంట కొలతలు తీస్తున్న సిబ్బంది (ఫైల్)

- రెండేళ్ల తర్వాత పర్యటిస్తున్న సామాజిక తనిఖీ బృందం
- పొలాల్లో, రోడ్లపై, చెరువులు, గుట్టల్లో కొలతలు తీస్తున్న సిబ్బంది
- 1618 పనులకు రూ.17.68 కోట్లు ఖర్చు

కెరమెరి: రెండేళ్ల తర్వాత 'ఉపాధి హామీ' పథకంలో చేపట్టిన పనుల తనిఖీలను అధికారులు చేపట్టారు. పొలాల్లో, రోడ్లపై, చెరువులు, గుట్టల్లో సిబ్బంది కొలతలు తీస్తున్నారు. కానీ కొలతలు, తనిఖీలు న్యాయబద్ధంగానే చేస్తున్నారా..? అనే అనుమానాలు మండల వాసుల్లో కలుగుతున్నాయి. కొన్ని చోట్ల యంత్రాలతో పనులు చేపట్టి కూలీలతో చేయించినట్లు చూపిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రూ.17.68 కోట్లు..

మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జాబ్‌కార్డులు 8398 ఉండగా, యాక్టివ్ జాబ్ కార్డులు 6978 ఉన్నాయి. ఇందులో 16,141 మంది కూలీలు ఉండగా, యాక్టివ్ కూలీలు 12,414 మంది ఉన్నారు. రెండేళ్ల కాలంలో 1618 పనులు చేయగా, వాటికి రూ. 17,68,59,946 ఖర్చు చేశారు. అందులో కూలీలకు వేతనాల రూపంలో రూ.15,41,28,065 కాగా, మెటీరియల్‌కు రూ. 2,27,31,871లను ఖర్చు చేశారు. ఇద్దరు ఎస్సీఆర్‌పీలు, 16 మంది డీఆర్‌పీలు, 34 మంది విలేజ్ సోషల్ ఆడిటర్లు విధుల్లో ఉన్నారు. 31 గ్రామ పంచాయతీల్లో మొదటి విడతలో 16 జీపీల్లో తనిఖీలు పూర్తి కాగా, మరో 15 గ్రామ పంచాయతీల్లో త్వరలో ప్రారంభించనున్నారు. తనిఖీలు పూర్తయిన జీపీల్లో గ్రామసభలు ప్రారంభమయ్యాయి. ఈ రెండేళ్లలో ఒక్క కెరమెరి గ్రామ పంచాయతీలోనే 338 పనులకు రూ.4,39,38,654లను కూలీలకు కూలి అందించగా, రూ. 36,88,788 మెటీరియల్ పేమెంట్ చేసినట్లు రికార్డులు చెబుతున్నాయి. ఇక్కడ యాక్టివ్ జాబ్ కార్డులు 1653 ఉండగా, 2521 యాక్టివ్ కూలీలు ఉన్నారు.

ఆరు నెలలకే తనిఖీలు చేయాల్సి ఉండగా..

వాస్తవంగా జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో కొనసాగిన పనులకు ఆరు నెలల్లోనే తనిఖీలు చేయాల్సి ఉంటుంది. కానీ రెండేళ్ల తర్వాత సామాజిక తనిఖీ బృందం ద్వారా పనులు, కూలీల తనిఖీలు చేపట్టడం వెనుక ఏదో మతలబు ఉందని పలువురు పేర్కొంటున్నారు. కాగా రెండేళ్ల క్రితం చేసిన పనులను గుర్తు పట్టడం కొంత కష్టంగా మారే అవకాశం ఉంది. కాగా గతేడాది వర్షాలు భారీగా కురవడంతో మట్టి పనులన్నీ కొట్టుకుపోయాయి. అలాంటప్పుడు కొలతలు ఎలా తీసుకుంటారు. పైపైనే మెజర్‌మెంట్ తీసుకుంటారా? ఉపాధి సిబ్బంది మాటే వేదమవుతుందా? అనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

పారదర్శకంగా తనిఖీలు



ఉపాధి హామీ పనుల తనిఖీలను సామాజిక తనిఖీ బృందం సభ్యులు పారదర్శకంగా నిర్వహిస్తున్నారు. పనులు చేసిన కూలీల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. పనులు జరిగిన ప్రదేశాలకు వెళ్లి కొలతలు తీసుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు నమోదు చేస్తున్నారు. అవకతవకలకు తావు లేదు. - మల్లయ్య, ఈజీఎస్ ఏపీవో

5కే రన్ విజయవంతం

- ఓటు హక్కుపై అవగాహన కల్పించిన అధికారులు



సిర్పూర్(టి): రన్ ప్రారంభిస్తున్న అధికారులు

దహెగాం: మండల కేంద్రంలో 'ఐ వోట్ ఫర్ షూర్' అనే కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించిన 5కే రన్‌ను డీటీ బక్కయ్య ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రన్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్సై సనత్‌కుమార్, ఎంపీడీవో రాజేశ్వర్ గౌడ్ పాల్గొన్నారు.

సిర్పూర్(టి): ప్రతీ ఒక్కరు తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ లలిత అన్నారు. శనివారం ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు మండల కేంద్రంలో స్థానిక యువకులతో కలిసి 5కే రన్ నిర్వహించారు. ఎస్సై దీకొండ రమేశ్, కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్, ఆర్ఐ జుగాదిరావ్, ఏపీఎం దుర్గయ్య, ప్రిన్సిపాల్ బాలరాజు, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలో శనివారం తహసీల్దార్ సరిత ఆధ్వర్యంలో 5కే రన్ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై కొమురయ్య, ఆర్‌ఐలు గోపాల్, సురేశ్, ఏపీఎం కోనయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాంకిడి: తహసీల్దార్ రహీముద్దిన్ ఆధ్వర్యంలో 'ఓట్ ఫర్ రన్' నినాదంతో శనివారం 5కే రన్ నిర్వహించారు. మండల కేంద్రంలో నిర్వహించిన రన్‌లో ఎంపీపీ ముండె విమలబాయి, జెడ్పీటీసీ అజయ్ కుమార్, సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్, ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డి, ఎంపీవో శివకుమార్, డిప్యూటీ తహసీల్దార్ శ్రవణ్ కుమార్, సర్పంచ్ తుకారాం, ఆర్‌ఐలు మాజిత్, ప్రమీల, యువకులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: ప్రజాస్వామ్యంలో కీలకమైన ఓటుహక్కుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ నాగరాజు గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో జాతీయ ఎలక్షన్ కమిషన్ ఓటు హక్కు అవగాహన కార్యక్రమంలో భాగంగా 5కే రన్ నిర్వహించారు. ఎంపీపీ డుబ్బుల నానయ్య, ఎంపీడీవో సత్యనారాయణ గౌడ్, ఏఎస్సై యాదవ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రెబ్బెన: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమైనదని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ అన్నారు. శనివారం గోలేటిటౌన్‌షిప్‌లో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమంలో భాగంగా 5కే రన్ నిర్వహించారు. మండలంలోని యువకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు ఉత్సాహంగా రన్‌లో పాల్గొన్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ వరలక్ష్మి, సర్పంచ్ సుమలత, సీపీఐ మండల కార్యదర్శి దుర్గం రవీందర్, పీఈటీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శనివారం 'ఐ ఓట్ ఫర్ ష్యూర్' కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో 5కే రన్ నిర్వహించారు. స్థానిక బీసీ హాస్టల్ విద్యార్థులతో ఉదయం 6 గంటలకు కేజీబీవీ హాస్టల్ నుంచి తలోడి దసలి పట్టు పరిశ్రమ వరకు రన్ నిర్వహిస్తామని ప్రకటించిన రెవెన్యూ అధికారులు వర్షం కురవడంతో రన్ నిర్వహించకుండానే కేవలం విద్యార్థులతో ఫొటో దిగి వెళ్లిపోయినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శనివారం కాగజ్‌నగర్‌లో నిర్వహించిన 5కే రన్ విజయవంతమైంది. కాగజ్‌నగర్ ఆర్డీవో రాజేశ్వర్, డీఎస్పీ కరుణాకర్, ఆర్డీవో కార్యాలయ సూపరింటెండెంట్ ప్రమోద్‌కుమార్, ఎంఈవో భిక్షపతి, ఆర్‌ఐ ఖాలిక్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు, యువకులు పాల్గొన్నారు.



వాంకిడి: 5కే రన్ ప్రారంభిస్తున్న తహసీల్దార్



పెంచికల్‌పేట్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



చింతలమానెపల్లి: రన్ ప్రారంభిస్తున్న తహసీల్దార్



దహెగాం: 5కే రన్ ప్రారంభిస్తున్న అధికారులు



రెబ్బెన: గోలేటిలో నిర్వహిస్తున్న 5కే రన్



కౌటాల: అధికారులతో బీసీ హాస్టల్ విద్యార్థులు

ఏఐటీయూసీ మహాసభలు విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రెబ్బెన: గోదావరిఖనిలో నిర్వహించనున్న ఏఐటీయూసీ 16వ రాష్ట్ర మహాసభలకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి అన్నారు. శనివారం గోలేటిటౌన్‌షిప్‌లోని కేఎల్ మహేంద్ర భవన్‌లో రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కార్మిక హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వాలపై అలుపెరగని పోరాటాలు చేస్తోందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలకు జాతీయ అధ్యక్షుడితో పాటు ప్రధానకార్యదర్శి హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి దుర్గం రవీందర్, బ్రాంచి కోశాధికారి శేషు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు రాజేశ్, దివాకర్, ఫిట్ కార్యదర్శి శ్రీనివాస్, మల్లేశ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సయ్య, కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం



కౌటాల: కేక్ కట్ చేస్తున్న సీఐ, ఎస్సై

కౌటాల: మండల కేంద్రంలో ఫొటోగ్రాఫర్ల యూనియన్ ఆధ్వర్యంలో మండలంలోని ఫొటోగ్రాఫర్లు శనివారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌటాల సీఐ సాధిక్‌పాషా, ఎస్సై మధుకర్, మండల ఫొటోగ్రాఫర్లు లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. సీఐ మాట్లాడుతూ ఫొటోగ్రఫీ రంగంపై ఎంతో మంది యువకులు ఆధారపడి జీవిస్తున్నారన్నారు. మారుతున్న కాలానుగుణంగా యువత ప్రతీ రంగంలో రాణించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు జీవన్, సభ్యులు శ్రీనివాస్, శంకర్, నాందేవ్, నాగేశ్, రాజు, బాలు, సునీల్, నాగరాజ్, భూమయ్య, శంకర్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో..

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలో శనివారం 184వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజీవ్ చౌక్ నుంచి అంబేడ్కర్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక పద్మశాలీ భవన్‌లో తాలుకాస్థాయి ఫొటోగ్రాఫర్ల సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్‌లతో కలిసి కేక్ కట్ చేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సమీర్, ప్రధాన కార్యదర్శి నీలి సతీష్, పట్టణ అధ్యక్షులు రాధాకృష్ణ, కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

విద్యార్థుల పురోగతికి తల్లిదండ్రులు సహకరించాలి



అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాస్

రెబ్బెన: విద్యార్థులు చదువుల్లో పురోగతి సాధించేందుకు తల్లిదండ్రుల సహకారం ఎంతో ముఖ్యమని పులికుంట కాలనీ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ అన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపేలా ఇంట్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టించాలని కోరారు. ఎస్ఎంసీ చైర్మన్ పోషన్న, వైస్‌చైర్మన్ కల్పన తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అఖండ భజన

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీ అభినవ శబరిమలై శ్రీ అయ్యప్ప ఆలయంలో అయ్యప్పదీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'నీ గానమే నా ప్రాణం' అఖండ భజన కార్యక్రమం ఎంతగానో అలరించింది. అఖండ భజన కార్యక్రమంలో భాగంగా ఆలయంలో ఉత్తరా నక్షత్ర పూజ, స్వామివారికి పంచామృతాభిషేకం, కాషాయ ధ్వజారోహణం, గోపూజ కార్యక్రమాల అనంతరం అఖండ జ్యోతిని వెలిగించి అఖండ భజనను ప్రచార సమితి జాతీయ అధ్యక్షులు రాజుదేశ్‌పాండే, రాష్ట్రఉపాధ్యక్షులు చక్రవర్తులు పురుషోత్తమాచార్యులు ప్రారంభించారు. వివిధ జిల్లాల నుంచి భజన బృందాల సభ్యులు పాల్గొన్నారు.

మైనార్టీబంధు చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న వైస్‌చైర్మన్ కృష్ణారావు

కాగజ్‌నగర్‌టౌన్: మైనార్టీ బంధు పథకం కింద మంజూరైన చెక్కులను శనివారం లబ్ధిదారులకు అందజేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు స్థానిక బల్దియా చైర్మన్ సద్దాం హుస్సేన్‌తో కలిసి ముస్లింలకు మంజూరైన రూ.లక్ష చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి సజీవన్ మాట్లాడుతూ 74 మంది లబ్ధిదారులకు చెక్కులు అందించినట్లు పేర్కొన్నారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సిద్దీఖ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వివి.ప్రసాద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీబంధు అమలు చేయాలి

కౌటాల: ఆదివాసీలకు రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీ బంధును ప్రకటించాలని ఆదివాసీ మన్నెవార్ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి మెర్పల్లి సదాశివ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దళిత, బీసీ, మైనార్టీ బంధు అమలు చేస్తున్నట్లు ఆదివాసీలకు సైతం ఆదివాసీ బంధు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్థికంగా, సామాజికంగా ఆదివాసీలు వెనుకబడి ఉన్నారన్నారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో ఆదివాసీలకు సబ్సిడీపై సంక్షేమ పథకాలు అందించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆదివాసీలకు రక్షణ లేకుండా పోతోందని ఆరోపించారు. హైదరాబాద్‌లో ఆదివాసీ మహిళపై దాడి చేసిన పోలీసులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

నేడు నమూనా పరీక్ష

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టెట్ పేపర్ 1 నమూనా పరీక్ష నిర్వహించనున్నట్లు ట్రస్ట్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాగజ్‌నగర్‌టౌన్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2023 -24 విద్యాసంవత్సరానికి గాను బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ కోర్సులలో ప్రవేశాల కోసం అభ్యర్థులు ఆన్‌లైన్‌లో సెప్టెంబర్ 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌కేఈ ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ దత్తాత్రేయ తెలిపారు. ఇతర వివరాలకు 9866398678 నంబర్‌పై సంప్రదించాలని సూచించారు.

విద్యావ్యవస్థ బలోపేతానికి హెచ్‌ఎంలు కృషి చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో విద్యావ్యవస్థ బలోపేతానికి హెచ్‌ఎంలు కృషి చేయాలని జిల్లా ఇన్‌చార్జి డీఈవో ఉదయ్‌బాబు తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్‌లకు రెండు రోజులపాటు నిర్వహించిన శిక్షణా శిబిరం శనివారం ముగిసింది. ఆయన మాట్లాడుతూ కాంప్లెక్స్ పరిధిలోని అన్ని పాఠశాలల్లో రీడింగ్ క్యాంపెయిన్‌ను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. సీఆర్పీలు గ్రంథాలయాల్లో పుస్తకాలు సక్రమంగా వినియోగించుకొనేలా దిశానిర్దేశం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అకాడమీ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్, ఎస్‌వోలు సుభాశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.